క్లుప్తంగా

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు తక్షణం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు శివారు సుంకరవారితోటలో నిర్వహించిన ధాన్యం బకాయి సొమ్ములు రావాల్సిన బాధిత రైతుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రైతులు, కౌలురైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి 40 రోజులు దాటిపోతున్నా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రబీ సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని చెప్పారు. మరో వైపు ఖరీఫ్ సాగు ముందుకు రావడంతో విత్తనాల కొనుగోలుకు సైతం పెట్టుబడి లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో సుమారు రూ.200 కోట్లు ధాన్యం బకాయి సొమ్ములు రైతులకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో బైరెడ్డి లక్ష్మణరావు,ఎన్ నాగరాజు, ధర్మవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న జాషువా, తన స్నేహితులను అభినందిస్తున్న రెడ్ క్రాస్ వైద్యులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్): రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాత కావాలని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో శుక్రవారం 27 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కె.జాషువా అనే యువకుడు రక్తదానం చేసేలా తన స్నేహితులను ప్రోత్సహించినందుకు ఆయన జాషువాకు అభినందనలు తెలిపారు. ప్రతి నెలా తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి కార్యక్రమాన్ని రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్‌ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, జి.స్పందన, పీఆర్‌ఓ కేవీ రమణ, జాషువా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు తమకాళ్లపై తాము నిలబడి సాధికారత సాధించడానికి లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఏలూరు విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వివిధసేవా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంద్రికగూడెంలోని సెయింట్ అంథోని పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు పలువురికి మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. గన్‌బజారులోని 25 మంది పేద మహిళలకు కుట్టుమెషీన్లు అందజేశారు. హనుమాన్ నగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మొక్కలను తోట ఎడ్వర్డ్ స్పాన్సర్ చేయగా, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ పావని, గ్లోబల్ సర్వీస్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవినాష్ రాజు, లయన్స్ జోన్ చైర్ ఐ.నిర్మల, రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్ బాధితులు

ఏడీఎంఈ ప్రిన్సిపాల్ జీఎంసీ డాక్టర్ విజయ్‌కుమార్





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఎంఈ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పాల్గొన్న వైద్యులు, ఏఎన్ఎంలు, టెక్నికల్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్) : ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2022లో భారత దేశంలో 14.10 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదు కావడంతో పాటు క్యాన్సర్ వల్ల 9.10 లక్షల మంది మరణించారని, ప్రస్తుతం దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారని ఏడీఎంఈ ప్రిన్సిపాల్ జీఎంసీ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2022లో 75,536 కొత్త క్యాన్సర్ కేసులు, 40,307 మరణాలు నమోదయ్యాయన్నారు. దేశంలో 75 ఏళ్ల లోపు వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం 10.6 శాతం, అదే వయస్సులో మరణించే ప్రమాదం 7.2 శాతం ఉందని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రమాదాలు 20 శాతం, 9.6 శాతంగా ఉన్నట్టు చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ కేసులు దేశంలో 34 శాతం ఉన్నాయన్నారు. వీటిని ముందుగా గుర్తించడం ద్వారా క్యాన్సర్ మనుగడ రేటును గణనీయంగా తగ్గించవచ్చన్నారు. క్యాన్సర్ కేసులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ల మార్గదర్శకంలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికల అమలు చేయడానికి నిర్ణయం తీసుకుందని చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించేందుకు 30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులందరినీ పరీక్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా విశాఖ పట్టణంలోని హోమీబాబా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అన్ని వైద్య కళాశాలల్లోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్లలోని నిపుణుల కోసం మొదటి స్థాయి సెన్సిటైజేషన్ శిక్షణ పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్‌లకు రెండో స్థాయి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మూడో స్థాయి శిక్షణలో పీహెచ్‌సీ మెడికల్ అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఉటుందన్నారు. హైపర్ టెన్షన్, మధుమేహం కోసం ఎన్‌సీడీ స్క్రీనింగ్ 3.0తో పాటు జూలై 2024లో స్క్రీనింగ్ ప్రారంభం కానుండగా జూన్ 15 నాటికి అన్ని శిక్షణా సెషన్‌లు పూర్తవుతాయని వెల్లడించారు.

రోగ నిర్ధారణకు రిపోర్టులు

స్క్రీనింగ్ సమయంలో కనుగొన్న క్యాన్సర్ కేసులు రోగ నిర్ధారణ, నిర్వహణ కోసం మెడికల్ కాలేజీలకు పంపుతారని డాక్టర్ విజయ్ కుమార్ చెప్పారు. ఈ కేసులను ఆరోగ్య వ్యవస్థ నిశితంగా పరిశీలిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా సరైన రిఫరల్ సిస్టమ్‌ను నిర్ధారిస్తూ డేటాను పర్యవేక్షించేందుకు, నిర్వహించడానికి ఏపీ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు డాక్టర్ల సహాయంతో సాంకేతిక మార్గదర్శకాలను అందిస్తుందని తెలిపారు. కొనసాగుతున్న ప్రోగ్రాం నాణ్యతా తనిఖీకి నిర్వహిస్తారని చెప్పారు.

రెండు స్థాయిల్లో శిక్షణ

ఏలూరు జిల్లాకు మే 28 నుంచి మే 30 వరకు ఫేజ్ వన్, పశ్చిమగోదావరి జిల్లాకు జూన్ 5 నుంచి జూన్ 7 వరకు ఫేజ్ 2 రెండు దశల్లో రెండో స్థాయి శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల సమన్వయంతో టీవోటీ శిక్షకుల బృందం, జీఎంసీ, ఏలూరు ద్వారా జిల్లా స్థాయిలో దంత వైద్యులు, గైనకాలజిస్టులు, వైద్య అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు గంగాభవాని, ఉషాకిరణ్, అనూషా, నశ్రీన్, లక్ష్మీ సరస్వతి, కీర్తి ప్రియాంక, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఎస్పీ సత్కారం



హోంగార్డు కృష్ణ గణేష్‌కు మెమెంటో అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (టూటౌన్): పదవీ విరమణ చేసిన హోంగార్డు వి.కృష్ణ గణేష్‌ను ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సత్కరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా హోంగార్డుకు శాలువా కప్పి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ పదవీ విరమణచేసిన కృష్ణగణేష్ పోలీస్ శాఖలో కార్పెంటర్‌గా పనిచేస్తూ అనేక అంశాల్లో తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన నేపథ్యాన్ని గుర్తుచేశారు. ఆయన సేవలను కొనియాడారు. హోంగార్డు 83 కృష్ణ గణేష్‌కి శాఖాపరమైన విషయాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎస్పీ మేరీ ప్రశాంతి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐ భాస్కర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ సోమసుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులు పాటించడం ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంచడానికి కృషి చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. పునాది అభ్యసనంతో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్థానిక ఆర్ఆర్ పేటలోని ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్‌లో గురు, శుక్రవారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కార్యక్రమానికి విచ్చేసిన సోమశేఖర్ మాట్లాడుతూ నూతన బోధనా పద్ధతులు, మూల్యాంకనం ద్వారా 1, 2 తరగతుల విద్యార్థుల్లో సంపూర్ణ అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు మాట్లాడుతూ ఈ శిక్షణలో ప్రధానంగా 1,2 తరగతి విద్యార్థులకు అక్షరాలు, పదాలు గుర్తించడం, వాక్య నిర్మాణం, అంకెలు గుర్తించడం చతుర్విధ గణిత ప్రక్రియలు గురించి పూర్తి అవగాహన రావడానికి సాంప్రదాయ పద్ధతులతోపాటు చేయడం ద్వారా నేర్చుకోవడం (లెర్నింగ్ బై డూయింగ్) ప్లే వే పద్ధతుల ద్వారా నేర్పడం కోసం శిక్షణ అందించామని చెప్పారు. ఈ శిక్షణకు ప్రతి మండలం నుంచి ముగ్గురు బెస్ట్ టీచర్లను డీఆర్పీలుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామని, వీరు మండలాలకు వెళ్లి ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో కీ రిసోర్స్ పర్సన్లుగా పి.వెంకటరమణ, కె.హరికృష్ణ, బి.రాజబాబు, ఎస్ రాము వ్యవహరించారు.

విజ్ఞాన వికాసానికి చిరునామా గ్రంథాలయాలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పద్మశ్రీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో విజ్ఞాన వికాసం పెంపొందించే చిరునామాగా గ్రంథాలయాలను చెప్పవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత నెలలో ప్రారంభించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు పాఠకులకు మాత్రమే కాక విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా తీర్చిదిద్దామని చెప్పారు. ప్రతి వేసవి కాలంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి, మేథాశక్తి పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చిన రిసోర్స్‌పర్సన్లను అభినందించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, రిసోర్స్ పర్సన్లకు జ్ఞాపికలు అంజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర బాబు, ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణ రావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలూరు రూరల్ : సర్టిఫికెట్లు సాధించిన బాలబాలికలు

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

ఏలూరు రూరల్ : బాలబాలికలు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని సీఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ గ్రంథ పాలకుడు దొడ్డపనేని రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా మరిన్ని విషయాన్ని తెలుసుకోవచ్చన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, బొమ్మల తయారీ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. లైబ్రేరియన్ కె.వాసుకి ఆధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా నాయకులు పి.పెంటయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



డీఈఓ అబ్రహాంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఈఓ ఎస్ అబ్రహాంను పీఆర్‌టీయూ నాయకులు కోరారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో శుక్రవారం డీఈఓ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. హైస్కూల్ ప్లస్‌లో పని చేస్తున్న పీజీటీ ఉపాధ్యాయులు ఏఏ తరగతుల్లో పాఠాలు బోధించాలి, వేసవి సెలవులు వంటి సమస్యలకు నిర్దిష్ట మార్గదర్శకాలు ఇప్పించాలని కోరారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, 14వ తేదీని కూడా కలిపి డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలి కోరారు. విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు వంటివి పాఠశాల పాయింట్‌కే చేర్చాలని కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారణకు ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని, అంగన్‌వాడీ పిల్లలందరూ వారి వయసును బట్టి ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్పించే బాధ్యతను అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో వివిధ కేడర్ల వారీగా సీనియారిటీ జాబితాలు తక్షణం విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి పి.ఏ సురాజు, పెదపాడు మండల అధ్యక్షుడు ఎండీ మురసాలీస్ ఉన్నారు.

బీజేపీ కార్యాలయంలో సంబరాలు



బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం చేయనుండడం పట్ల జిల్లా బీజేపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొని మాట్లాడారు. ప్రజలు చారిత్రాత్మక తీర్పుతో దేశంలో వరుసగా మూడోసారి మోదీ ప్రధాని అవుతున్నారని చెప్పారు. మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర పాలనకు ప్రజలు మద్దతిచ్చారని అన్నారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడబోతుండటం శుభపరిణామమని చెప్పారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎన్డీఏ అభ్యర్థులందరికీ గారపాటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దానభాస్కరరావు, వివిధ నియోజకవర్గాల కన్వీనర్లు గుమ్మడి చైతన్య, గాది రాంబాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు నాగం శివ, బుజ్జి గోఎల్‌ఈ, సుబ్రహ్మణ్య వరప్రసాద్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కుసుమ, నాయకులు పసుపులేటి మనోహర్ ప్రసాద్, గణపతి, వెంకట నాగేశ్వరరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే బడేటి చంటికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నూతన ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 నాయకులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. ఏలూరు ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన బడేటి చంటిన ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం యూనియన్ నాయకులు కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకంక్షలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు నాయక్, జిల్లా కార్యదర్శి వి.రాము, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు పాతాళ శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి జి.నాగేశ్వర రావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే.. బడేటి చంటిని కాపు సంక్షేమ సేన నాయకులు కలిసి సత్కరించారు.

ఆయా పార్టీల శ్రేణులందరికీ కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది తదితరులు

ఏలూరు (టూటౌన్): మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్య చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక గవరవరం చెరువు గట్టు ప్రాంత ప్రజలకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ మనకు హాని చేసే దోమలైన మలేరియా కారక దోమ అనాఫిలస్, డెంగీ కారక దోమ ఎడిస్ ఇళ్లలో ఉండే నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి డ్రైడే – డ్రైడే కార్యక్రమం ఆచరించాలని సూచించారు. జ్వరం, చలి,వణుకు, చెమట పట్టడం మొదలగు లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రాలను లేదా అర్బన్ హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించాలని అన్నారు. ఆయా కేంద్రాల్లో మలేరియా, డెంగీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జి.నాగమణి, హెల్త్ అసిస్టెంట్స్ మేక శ్రీనివాసరావు, సీహెచ్ రమేష్, అయ్యప్ప, ఆశా కార్యకర్తలు కె.శాంతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్ : ఈ నెల 9వ తేదీ ఆదివారం తంగెళ్లమూడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతులతో పాటు తీగలపై వాలే చెట్ల కొమ్మలు తొలిగించే పనులు చేపడతామని పేర్కొన్నారు. ఎంఆర్‌సీ కాలనీ, యాదవ్ నగర్, కబడ్డిగూడెం, రాణీనగర్, తిలక్‌నగర్, ఇజ్రేయల్‌పేట, లంకపేట, బడేటినగర్, ఖంద్రికగూడెం సెంటర్, తాపీమేస్త్రీ కాలనీ, ద్వారకానగర్, బీడీ కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

శ్రీవారి సేవలో ఏలూరు అడిషనల్ ఎస్పీ



ఏఎస్పీ స్వరూపారాణి

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని ఏలూరు అడిషనల్ ఎస్పీ జి.స్వరూపారాణి శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	38
కాకర కాయలు	50-64	కీరా దోస	54
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	54	అల్లం	170
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	30-55
క్యారెట్	40-52	పాలకూర	15
దొండకాయలు	20	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	28-32	గోంగూర	07
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

రజకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని రజకుల సమస్యలను పరిష్కరించాలని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని రజక సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయం సాధించడం అభినందనీయమని, నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని రజకుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రజకుల దోబీఘాట్లకు నిధులు మంజూరు చేయాలని, జీఓల ప్రకారం రజకుల చెరువుల కేటాయింపులు, లీజులు నిర్ణయించాలని అన్నారు. చెరువుల విద్యుత్ మోటార్స్ కనెక్షన్స్ విషయంలో చొరవ చూపాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. రజక సంఘాలన్నీ ఏకత్రాటిపైకి వచ్చి తమ సమస్యల సాధనకు సహకరించాలని కట్లయ్య అన్నారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక నేతలు కొమ్మంటి మురళి, చాటపర్రు శ్రీనివాసరావు, కడెల్లి సుబ్బయ్య, బూరుగుపల్లి శ్రీనివాసరావు,జువ్వలపాలెం సత్యనారాయణ, అమీనాపేట శేషు, దుర్గారావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) SWARAJ 744 2022 MODEL AP39 MS 7640
2) MAHINDRA 275 XP+ 2023 MODEL AP39 SB 3632
3) MAHINDRA 475 2017 MODEL AP37 CU 8206
Cell : 77806 27429
23B-5-93, 1st Floor, Edara Vari Street, Powerpeta, ELURU.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
79955 66352
Office mail : tpgadvt@gmail.com